

జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (సీడీసీఎంఎస్)లో 'లెక్క'లేనితనం నెలకొంది. ఇక్కడి అవినీతిపై తరచూ పత్రికల్లో వార్తలు వచ్చినా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి భయంతో సహకారశాఖ అధికారులు అటువైపు చూడలేదు. వైసీపీ ఐదేళ్ల కాలంలో ఆ పార్టీ నేత సహదేవరెడ్డి రెండేళ్లు, ఆయన సతీమణి నాగలక్ష్మి మూడేళ్లు పాలకవర్గం చైర్మన్లుగా వ్యవహరించారు. 2019 వరకు టీడీపీ హయాంలో చైర్మన్‌గా ఉన్న శ్యామరాజు వైసీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీలో చేరిపోయారు. వైసీపీ హయాంలో సెవెన్‌మెన్ కమిటీ పాలకవర్గం జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యమిచ్చిందన్న ఆరోపణలున్నాయి. దీంతో సొసైటీ నష్టాల్లో మునిగిపోయింది.

\- చిత్తూరు కలెక్టరేట్

● గతంలో ఘనకీర్తి
నేడు అధోగతి

సీడీసీఎంఎస్‌లో లెక్కలేనితనం

● అక్రమాలకు సహకారం.. భారీగా నిధుల దుర్వినియోగం



చిత్తూరులోని సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ భవనం

1943లో చిత్తూరు హోల్‌సేల్ కో-ఆపరేటివ్ స్టోర్ లిమిటెడ్‌గా ఏర్పడి, ఆ తర్వాత 1956లో సీడీసీఎంఎస్ పేరిట రిజిస్టర్ చేసుకుని వ్యాపారం ప్రారంభించింది. రైతులకు సేవలందించడంలో డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లదే కీలక పాత్ర. డీసీసీబీ ద్వారా రైతులకు రుణాలిస్తే.. సీడీసీఎంఎస్ ద్వారా ఎరువులు ఇస్తున్నారు. అదే సమయంలో సీడీసీఎంఎస్ సంస్థ ఇతర ప్రభుత్వ సంస్థలకు సేవలందిస్తూ 82 ఏళ్లుగా ఆదాయాన్ని సమకూర్చుకుంటూ వస్తోంది. నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, జిప్సమ్, ఎరువులు, క్రిమి సంహారక మందుల అమ్మకాలు, వేరుశనగ విత్తనకాయల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లు నిర్వహించి గతంలో ఉత్తమ సహకార సంస్థగా పేరు పొందింది. గతంలో టీటీడీలో లడ్డూ తయారీకి అవసరమైన పప్పు దినుసులను లాభాపేక్ష లేకుండా సీడీసీఎంఎస్ సరఫరా చేసింది. 1955, 1962లో తిరుపతి ఎమ్మెల్యేగా ఉంటూ, టీటీడీ బోర్డు సభ్యుడిగా కొనసాగిన రెడ్డివారి నాదమునిరెడ్డి జోక్యంతో ఇదంతా జరిగింది. అటువంటి ఘనకీర్తి కలిగిన సహకార సంస్థ తీరు కొన్నేళ్లుగా వివాదాస్పదంగా మారింది. మంచి పేరు మసకబారి నేడు అధోగతి పాలైంది.


పట్టించుకోకుండా వదిలేయడంతో వాయల్పాడు డిపో గోడౌన్‌లో పెరిగిన చెట్లు

ఆస్తులు ఆక్రమణలకు గురవుతున్నా...

గతంలో సీడీసీఎంఎస్ పరిధిలో 10-12 డిపోలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య ఆరుకు పడిపోయింది. వాయల్పాడు డిపో భవనం మధ్యలో రాగిచెట్టు మొలిచినా, దానిని తొలగించలేదు. దాదాపు అన్ని డిపోల్లోనూ ఇంచుమించు ఇవే పరిస్థితులున్నాయి. వేరుశనగ విత్తన అమ్మకాల ప్రక్రియ ఆర్బీకేలకు వెళ్లడంతో ఈ సంస్థ ఆదాయం పూర్తిగా తగ్గింది. బాడుగుల రూపేణా వస్తున్న రూ.25లక్షలే ఉద్యోగులకు జీతాలిచ్చేందుకు ఆదుకుంటున్నట్లు సమాచారం.

నిధుల దుర్వినియోగం

సీడీసీఎంఎస్‌లో నిధుల దుర్వినియోగంపై అనేక ఫిర్యాదులున్నాయి. ఎంత ఆదాయం వస్తోంది? ఎంత ఖర్చవుతోందనే లెక్కలు తేలడం లేదు. శాఖల్లో ఎరువుల స్టాక్ వెరిఫికేషన్ జరగడం లేదు. శాఖల తనిఖీలు అసలుకే లేదు. సిట్టింగ్ ఫీజు ఇష్టారాజ్యంగా వాళ్లే పెంచుకుంటున్నారు. ఉద్యోగుల వద్ద ఉన్న ఔట్‌స్టాండింగ్ నిధుల వసూళ్లను మరచిపోయారు. ఆస్తులు, ఫర్నిచర్ రిజిస్టర్లు లేవు. ఈపీ (ఎగ్జిక్యూటివ్ పిటిషన్)లపై సంవత్సరాల తరబడి చర్యలు తీసుకోవడంలో పాలకవర్గం విఫలమైంది. గతంలో బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి రిటైరైన వెంకటమునిరెడ్డి స్వాహా చేసిన రూ.2.34 లక్షల రికవరీ ఊసేలేదు.

కొనసా...గుతున్న విచారణ

2019 వరకు చైర్మన్‌గా పనిచేసిన శ్యామరాజు హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ కొనసాగుతోంది. అగ్రిమెంటు రికార్డు ట్యాంపరింగ్ చేసినట్లు ఫిర్యాదులున్నాయి. శాంతిపురం సొసైటీలో బంగారు రుణాల్లో రూ.కోటి దుర్వినియోగంపై సహకారశాఖ అధికారులు ఏళ్ల తరబడి విచారణ చేస్తూనే ఉన్నారు. ఈయన హయాంలో లెక్కకు మించి అక్రమాలు జరిగాయని విమర్శలున్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకే ఆయన గత ప్రభుత్వ హయాంలో వైసీపీలో చేరినట్లు చెబుతున్నారు.

రూ.33 లక్షల బకాయిల వసూళ్లు గాలికి

సీడీసీఎంఎస్‌లో 2013 నుంచి రూ.33 లక్షల బకాయిలున్నాయి. గత ఐదేళ్లలో పాలకవర్గం బకాయి వసూళ్లపై దృష్టి పెట్టలేదు. వారిపై ఈపీ దాఖలు చేయకపోవడం పట్ల మతలబు ఏమిటో తెలియడం లేదు. వేరుశనగ విత్తనాలు, నవధాన్యాలను సింగిల్ విండోలు, ప్రైవేటు వ్యక్తుల ద్వారా అమ్మగా, దానికి సంబంధించిన రూ.33,98,500 బకాయిల వసూళ్లను 11 ఏళ్లుగా పట్టించుకోవడం లేదు. దీనికి వడ్డీ, అపరాధపు వడ్డీ, వడ్డీపై వడ్డీ అంతా కలిపితే రూ.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. సింగిల్ విండోల వారీగా శాంతిపురం రూ.6.10 లక్షలు, శ్రీరంగరాజపురం రూ.3.67 లక్షలు, పుంగనూరు రూ.2.70 లక్షలు, గుడిపాల రూ.2.94 లక్షలు, కుప్పం 1.33 లక్షలు, ఐరాల రూ.59 వేలు, కొండ్రాజుకాల్వ రూ.63 వేలు, పూతలపట్టు రూ.76 వేలు, తవణంపల్లె రూ.7,700... రామసముద్రం, చౌడేపల్లి విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.3.87 లక్షలు, పెద్దమండ్యం, ములకలచెరువు విండోల్లో ప్రైవేటు వ్యక్తుల నుంచి రూ.2.59 లక్షల బకాయిలు ఉన్నాయి.

సీడీసీఎంఎస్‌కు జడ్పీ సాధారణ నిధులు

రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి సిఫార్సు మేరకు అప్పటి జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి 2020లో జడ్పీ సాధారణ నిధుల నుంచి 10శాతం.. రూ.25లక్షలు విడుదల చేసి సీడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయ మరమ్మతు పనులు చేశారు. ఇప్పటికీ ఆ పనులు చేసిన కాంట్రాక్టర్‌కు నిధులు పూర్తిగా విడుదల కాలేదు. 2014-19 నాటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐసీడీపీ-2 (ఇంటిగ్రేటెడ్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు-2) ద్వారా సీడీసీఎంఎస్‌కు రూ.6.60 కోట్లు వ్యాపారాభివృద్ధి నిమిత్తం ఇచ్చేందుకు ప్రాజెక్టు రిపోర్టు సిద్ధమైంది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు రిపోర్టును పక్కన పెట్టడంతో పైసా కూడా విడుదల కాలేదు.

వరుస నష్టాలు..

సహకార శాఖ ఆడిట్ అధికారులు తయారు చేసిన నివేదికల మేరకు సీడీసీఎంఎస్ వరుస నష్టాల్లో కూరుకుపోయింది. నివేదిక మేరకు చూసుకుంటే.. 2019-20లో రూ.43.13 లక్షలు, 2020-21లో రూ.15.98 లక్షలు, 2021-22లో రూ.16.30 లక్షల నష్టాల్లో ఉంది. తిరుపతిలో ఆర్టీసీ బస్టాండు ఎదురుగా ఉన్న సీడీసీఎంఎస్‌కి చెందిన హోటల్ స్థలం లీజు వ్యవహారంలో పాలకవర్గం తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పెంచుకుంటోంది. లెక్కల్లో చూపేది కొంత, సొంత జేబుల్లో వేసుకునేది మరికొంతగా మారిందన్న ఆరోపణలున్నాయి.

పక్కదారి పట్టిన నిధులు

ఐదేళ్ల వైసీపీ పాలనలో సీడీసీఎంఎస్‌లో నిధులు పక్కదారి పట్టాయి. ఎరువుల వ్యాపారాన్ని అప్పటి ప్రభుత్వం ఆర్బీకేలకు మళ్లించడంతో వ్యాపారాభివృద్ధి కుంటుపడింది. నిబంధనలకు విరుద్ధంగా సిబ్బంది నియామకం, వారికి భారీగా జీతాలు చెల్లించడం, పలువురిని పర్మినెంట్ చేయడం వంటివి జరిగినట్లు తెలుస్తోంది. ఎరువులు, వేరుశనగ విత్తనాలు, జిప్సం విక్రయాల్లోనూ లెక్కలు తేలడం లేదని సమాచారం. వేరుశనగ, ఎరువుల విక్రయాల్లో ఎంతమేర జీఎస్టీ వసూలు చేశారో రికార్డులు లేవు.

లేని ఉద్యోగుల పేరిట జీతాల చెల్లింపు

చిత్తూరులోని ప్రధాన కార్యాలయంలో అకౌంటెంట్, అటెండర్ పోస్టులు లేకున్నా, వారున్నట్లు సృష్టించి ప్రతినెలా జీతాల రూపేణా రూ.25వేలు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 2019, 2020 సంవత్సరాల్లో కరోనా ఉధృతంగా ఉండి ఎవరూ ఇళ్ల బయటకు రాలేదు. ఆ సమయంలో పాలకవర్గ చైర్మన్ చిత్తూరుకు వచ్చి వెళ్తున్నట్లు, అద్దె కారుకు నెలకు రూ.35 వేలు చెల్లించినట్లు రికార్డులో చూపారు. ప్రస్తుత బిజినెస్ మేనేజర్ ఏ బ్రాంచ్‌నూ తనిఖీ చేసిన దాఖలాల్లేవు. రికార్డులను లోతుగా పరిశీలిస్తే ఇలాంటి ఎన్నో అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

రెస్కోపై విజిలెన్స్ దాడులు

కుప్పం, జూలై 15: కుప్పం రెస్కోపై తిరుపతి ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం ప్రధాన కార్యాలయానికి వచ్చిన ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐలు వెంకటచిన్న, ధరణీధర్ తదితరులు రాత్రి వరకు రికార్డులు తనిఖీ చేశారు. మంగళవారం కూడా తనిఖీలు జరపనున్నారు. 'రెస్కోలో కృష్ణమాయ' శీర్షికన సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించి ఈ దాడులు జరిగాయి. కుప్పం రెస్కో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న ఉద్యోగి ఒకరు ఈ సంస్థలో జరిగిన అనేక అక్రమాలకు, అవినీతికి కారణమని ఈ వార్తా కథనంలో పేర్కొనడం జరిగింది. అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలకు సంబంధించిన ప్రతిఫైలు ఈయన టేబుల్ మీదినుంచే కదిలాయి. గతంలో సస్పెండైన ఏడాది కాలానికి సెలవులుగా మార్చుకోవడం ఈయనకే చెల్లింది. ఇటీవల రెస్కోలో మాయమైన సర్వీసు రిజిస్టర్ వెనుక ఈ ఉద్యోగి ప్రమేయమున్నా గుడుపల్లెకు బదిలీ చేయడంతో అధికారులు సరిపెట్టారు. తమ అక్రమాలకు, అవినీతి చర్యలకు కొమ్ముకాశాడన్న కృతజ్ఞతతోపాటు, ఆయనమీద ఏదైనా యాక్షన్ తీసుకుంటే లోగుట్టు రట్టవుతుందన్న భయం కూడా ఆయన మీద ఈగ వాలనివ్వకుండా చేసింది. ఇప్పటికే రెస్కోలో అక్రమాలు, అవినీతిపై ప్రభుత్వం డివిజనల్ స్థాయి కో ఆపరేటివ్ అధికారులతో ప్రాథమిక విచారణ జరిపించి.. ప్రత్యేకంగా సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్ కె.శ్రీలక్ష్మిని విచారణాధికారిగా నియమించింది. ఆమె 18వ తేదీన రెస్కోకు వచ్చి విచారణ చేపట్టనున్నారు. అదే సమయంలో ఇప్పుడు ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు దాడులు చేయడం గమనార్హం. ఈ ఫైళ్ల తనిఖీల సందర్భంగా పదోన్నతులు, నియామకాలు, కొనుగోళ్ల వంటి విషయాల్లో అక్రమాలు చోటు చేసుకున్న విధానం వారిని ఆశ్చర్య పరిచినట్లు సమాచారం. రెస్కోలో జరిగిన అవకతవకలపై విచారణకు వచ్చామని, క్షుణ్ణంగా పరిశీలించాక ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని విజిలెన్స్ అధికారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.


రెస్కో రికార్డులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులు

రెస్కో ఎండీ బాధ్యతల స్వీకరణ



కుప్పం రెస్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా తిరుపతి ఎస్పీడీసీఎల్ నుంచి వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎస్.సోమశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతదాకా ఆ విధులు నిర్వహించిన ఎండీ ప్రభాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. రెస్కోలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతి చర్యలపై విచారణ ప్రారంభమైన నేపథ్యంలో ఎండీగా ఎస్పీడీసీఎల్ ఈఈని నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేడు, రేపు పాఠశాలలకు సెలవు

చిత్తూరు (సెంట్రల్), జూలై 15: మొహర్రం సందర్భంగా మంగళ, బుధవారాల్లో అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో దేవరాజు తెలిపారు. మంగళవారం ఐచ్ఛిక.. బుధవారం ప్రభుత్వ సెలవు రోజన్నారు. సెలవు రోజుల్లో బడులు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పుంగనూరులో కిలో టమోటా రూ.65

పుంగనూరు రూరల్, జూలై 15: పుంగనూరు మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.65 పలికింది. నాణ్యత గల మొదటి రకం కిలో రూ.65, రెండో రకం రూ.61, మూడో రకం రూ.58 చొప్పున రైతుల నుంచి 320.93 మెట్రిక్ టన్నుల టమోటాలను వ్యాపారులు కొనుగోలు చేశారు.

రహదారులకు మోక్షం

● తక్షణ మరమ్మతుల కోసం రూ.60 కోట్లతో ప్రతిపాదనలు
● వెంటనే మరమ్మతులు చేయాలని సీఎం ఆదేశం
● వైసీపీ హయాంలో నిర్వహణనూ పట్టించుకోని వైనం


యాదమరి మండలం పత్రపల్లె (తమిళనాడు సరిహద్దు ప్రాంతం) వద్ద అధ్వానంగా ఉన్న రహదారి

చిత్తూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అన్నింటిలాగే రహదారులనూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. అభివృద్ధిని పక్కనపెడితే.. కనీసం నిర్వహణనూ విస్మరించింది. రహదారులపై గుంతలతో జనం అవస్థలు పడుతున్నా, వర్షాలకు గుంతల్లో నీళ్లు చేరి చెరువుల్ని తలపించినా పట్టించుకోలేదు. ఇలాంటి గుంతల రహదారుల మీద ప్రయాణించి ఎంతో మంది ప్రమాదాల బారిన పడ్డారు. ఎన్నో వాహనాలూ దెబ్బతిన్నాయి. జగన్ బాధిత వర్గాల్లో వాహనదారులూ ఉన్నారు. అలాంటి రోడ్లకు ప్రస్తుత ప్రభుత్వంలో మంచి రోజులు వస్తున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి వైపు దృష్టి పెట్టింది. ఇటీవల ఆర్‌అండ్‌బీ అధికారుల సమీక్షలో పాల్గొన్న సీఎం చంద్రబాబు అత్యవసరమున్న రహదారుల్ని వెంటనే మరమ్మతులు చేయాలని, అవసరమైన ప్రతిపాదనల్ని సిద్ధం చేయాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ అధికారులు జిల్లాలో అత్యవసర.. సాధారణ మరమ్మతులు చేయాల్సిన రోడ్లను గుర్తించారు. వీటికి రూ.60 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని పంపారు. జిల్లా అంతటా రూ.5.96 కోట్లు తక్షణ అవసరమని ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనను సిద్ధం చేయగా.. కుప్పం నియోజకవర్గంలో దెబ్బతిన్న 137 కిలోమీటర్ల రహదారుల మరమ్మతులకు రూ.52 కోట్లతో కలెక్టర్ విడిగా ప్రతిపాదన సిద్ధం చేసి పంపించారు.

ఇవీ ప్రతిపాదనలు

- కుప్పం నియోజకవర్గంలో మొత్తం 450 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులుండగా.. 137 కిలోమీటర్ల మేర దెబ్బతిన్నాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.52 కోట్లతో ప్రతిపాదన పంపించారు.
- కుప్పం నియోజకవర్గంలో రహదారులపై గుంతల్ని పూడ్చేందుకు రూ.1.50 కోట్లతో మరో ప్రతిపాదన సిద్ధం చేశారు.
- జిల్లాలో రెండు రాష్ట్ర రహదారుల్ని తక్షణం మరమ్మతులు చేసేందుకు రూ.31 లక్షలు.. 14 రహదారుల్లో గుంతలు పూడ్చేందుకు రూ.65.35 లక్షలు మంజూరు చేయాలని ప్రతిపాదనల్లో కోరారు.
- జిల్లాలోని 9 జిల్లా రహదారుల్ని అత్యవసరంగా మరమ్మతులు చేసేందుకు రూ.70.50 లక్షలు.. 92 జిల్లా రహదారులపై గుంతలు పూడ్చేందుకు రూ.4.30 కోట్లు అవసరమని ప్రతిపాదన సిద్ధం చేశారు.
- జిల్లాలో రహదారుల భద్రత కోసం (సోలార్ బ్లింకింగ్, బ్లాక్ స్పాట్, జీబ్రా క్రాసింగ్) కోసం రూ.37 లక్షలు కావాలని కోరారు.

ఎమ్మెల్యే చొరవతో కదలిక


ఇటీవల కుప్పంలో సీఎం సెక్రటరీ ప్రద్యుమ్నకు ప్రతిపాదనలు అందిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే

యాదమరి మండలంలోని జోడిచింతల నుంచి పరదరామి (తమిళనాడు సరిహద్దు) వరకున్న 12 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిలో దారుణమైన గుంతలున్నాయి. ఎమ్మెల్యే అయ్యాక తన తొలి ప్రాధాన్యం ఈ రోడ్డు అభివృద్ధేనని మురళీమోహన్ పలుమార్లు చెప్పారు. అనుకున్నట్టే ఆ మధ్య కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటించినప్పుడు.. సీఎంకు, ఆయన సెక్రటరీ ప్రద్యుమ్నకు ప్రతిపాదనల్ని అందించారు. నారా లోకేశ్‌ను కలిసినప్పుడు కూడా ఈ రోడ్డు గురించి ప్రస్తావించారు. దీంతో సీఎం సెక్రటరీ ప్రద్యుమ్న అత్యవసరంగా అభివృద్ధి చేయాలని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్‌కు తాజాగా లేఖ రాశారు. రోజుల వ్యవధిలో ఇక్కడ రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రోడ్డులోని గుంతల్ని పూడ్చేందుకు వెంటనే రూ.22 లక్షలు కావాలని ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా కలెక్టర్ సుమిత్‌కుమార్ మరో ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపారు.

● ఇదిలా ఉండగా.. ఈ రహదారి అభివృద్ధికి, మరమ్మతు కోసం వైసీపీ పాలన ఐదేళ్లలో సుమారు 8 సార్లు అధికారులు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు.

ఎడతెరపిలేని వర్షం

రెండు రోజులుగా చిరుజల్లులు



చిత్తూరు కలెక్టరేట్, జూలై 15: జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులు పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా సోమవారం 1.6 మి.మీ సరాసరి వర్షం కురిసింది. చిత్తూరు నగరంలో పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరింది. ఈ వర్షం రైతాంగానికి ఎంతోమేలు చేస్తుందని వ్యవసాయదారులు అభిప్రాయపడుతున్నారు. గడచిన 24 గంటల్లో 21 మండలాల్లో వర్షం కురిసింది. నింద్రలో 8.2మి.మీ, పెనుమూరు 5.0, చౌడేపల్లి 4.2, రొంపిచెర్ల 3.2, గుడిపాల 3.0, పూతలపట్టు 2.8, కార్వేటినగరం 2.6, తవణంపల్లె 2.6, నగరి 2.4, విజయపురం 2.2, పులిచెర్ల 2.0, గంగాధరనెల్లూరు 2.0, చిత్తూరు అర్బన్ 1.8, గంగవరం 1.4, పలమనేరు 1.4, యాదమరి 1.4, చిత్తూరు రూరల్ 1.4, సదుం 1.2, వెదురుకుప్పం 1.2, పాలసముద్రం 1.2, ఐరాల 0.8 మి.మీ వర్షం కురిసింది. జూలై నెల సగటు వర్షపాతం 103.9 మి.మీ కాగా సోమవారం వరకు 75.8 మి.మీ నమోదైంది. ఇప్పటికే 26 మండలాల్లో 20శాతానికి మించి, ఐదు మండలాల్లో సాధారణ వర్షం, శాంతిపురంలో సాధారణానికి కంటే తక్కువ నమోదైంది.

అమ్మో.. చిరుత!



పలమనేరు మండలం ఎర్రపెంట గ్రామ పొలిమేరల్లో చిరుత దాడిలో చనిపోయిన లేగదూడ

పలమనేరు, జూలై 15: పలమనేరు మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాల్లో చిరుతలు సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. వారం రోజుల వ్యవధిలో నలగాంపల్లి, ఎర్రపెంట గ్రామాల వద్ద పొలాల్లోని ఒక ఆవు, దూడను చంపేయడంతో రైతులు భయపడుతున్నారు. ఈనెల 7 వతేది రాత్రి నలగాంపల్లి సమీపంలోని ఒక రైతు పొలం వద్ద కట్టిఉన్న ఆవును చంపి కాలి జబ్బను పూర్తిగా చిరుత తినేసింది. ఈనెల 14వతేది రాత్రి ఎర్రపెంట గ్రామ సమీపంలో గోవిందరాజులు పొలం వద్ద ఉన్న లేగదూడను చిరుత చంపి తినేసిందని రైతులు తెలిపారు. అటవీ సమీప పొలాల్లో పంటలు, మామిడి, అరటి తోటలను మూడు దశాబ్దాలుగా ఏనుగులు తొక్కి నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ క్రమంలో చాలా మంది గడ్డిపండించుకొని పాడి పశుపోషణపై జీవనం సాగిస్తున్నారు. అలాంటిది పొలాల వద్ద ఉన్న ఆవులు, దూడలకు కూడా ఇప్పుడు చిరుతలతో రక్షణ లేకుండా పోతోందని ఆవేదన చెందుతున్నారు. కాగా, ఆదివారం రాత్రి ఎర్రపెంట గ్రామం వద్ద చిరుత దాడిలో చనిపోయిన లేగదూడకు అటవీ శాఖ అధికారులు సోమవారం పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దూడ కళేబరాన్ని ఖననం చేయించారు.

పశువులపై దాడి చేస్తోంది చిరుతలు కావు

అటవీ సరిహద్దుగ్రామాల వద్ద కొద్దిరోజులుగా పశువులపై దాడిచేసి చంపుతోంది చిరుతలు కావని పలమనేరు రేంజర్ శివన్న తెలిపారు. చిరుత దాడిచేసే విధానం మరోవిధంగా ఉంటుందన్నారు. అడవిలోనుంచి వచ్చిన హైనాలు ఈ దాడికి పాల్పడి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజలు చిరుత వచ్చిందని ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అయినా, రాత్రివేళ తమ పశువులను భద్రపరచుకోవాలని రైతులకు సూచించారు. గ్రామంలోని తమ ఇళ్లవద్ద పశువులకు పాకలు ఏర్పాటుచేసుకొంటే ఈ సమస్య ఉండదన్నారు.

టమోటా దొంగలు

సోమల, జూలై 15: టమోటా ధరలు అమాంతంగా పెరగాయి. 15కిలోల బాక్సు ధర సోమవారం రూ.800, రూ900కు చేరాయి. దీంతో టమోటా తోటల్లో దొంగలు పడ్డారు. రాత్రిళ్లు బాక్సులకొద్దీ కోసుకెళుతున్నారు. రెండు రోజులుగా పలు తోటల్లో దొంగ పడుతున్నారని రైతులు వాపోతున్నారు. సోమల సమీపంలోని ఊరకొండ వద్ద మార్కెట్ రాజు పొలంలో సుమారు 50 బాక్సుల మేరకు చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఈయన ఎకరా పొలాన్ని లీజుకు తీసుకుని టమోటా సాగు చేశారు. రెండు రోజులు స్వగ్రామానికి వెళ్లడంతో దుండగులు శనివారం రాత్రి టమోటాలు దొంగతనంగా కోసుకు వెళ్లారు. అలాగే చిన్న సోమల మార్గంలోని పలు తోటల్లో చోరీలు జరిగినట్లు రైతులు తెలిపారు. కొందరు రైతులు పొలాల వద్ద రాత్రి కాపు గాస్తున్నా చోరీలు జరుగుతున్నాయి.

50 ద్విచక్ర వాహనాల స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపి మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

పూతలపట్టు, జూలై15: పూతలపట్టు పోలీసులు రూ.45లక్షల విలువ చేసే 50 ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టుచేసి రిమాండుకు పంపారు. ఈ వివరాలను సోమవారం ఎస్పీ మణికంఠ మీడియాకు వెల్లడించారు. పూతలపట్టు సీఐ సుదర్శన్‌ప్రసాద్ తమ సిబ్బందితో ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో రంగంపేట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారన్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడన్నారు. అతడిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని, ద్విచక్రవాహనం గురించి విచారించారన్నారు. తాను ద్విచక్రవాహనాన్ని దొంగిలించినట్లు నిందితుడు పోలీసుల విచారణలో అంగీకరించినట్లు ఎస్పీ చెప్పారు. నిందితుడు నెల్లూరు జిల్లా ముదివర్తివారిపల్లెకి చెందిన ముదివర్తి సందీప్ అలియాస్ సాయి(24)గా విచారణలో తేలింది. ఇతడి నుంచి 50 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చొరవ చూపిన చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐ సుదర్శన్ ప్రసాద్, కానిస్టేబుల్ రవి, ముక్తితోపాటు పలువురు పోలీసులకు ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రమాదస్థలంలో భానుప్రియ మృతదేహం

నారాయణవనం, జూలై15: మండల పరిధిలోని పాలమంగళం సమీపంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి చెం దింది. ఎస్ఐ కథనం మేరకు.... నాగలాపురం మండలం, నందనం గ్రామానికి చెందిన భానుప్రియ(24) భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై పుత్తూరు నుంచి నాగలాపురం వెళుతుండగా, పాలమంగళం వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయింది. వెనుక నుంచి వచ్చిన లారీ భానుప్రియ మీదుగా వెళ్లడంతో అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంచెకు కరెంటు సరఫరా

విద్యుదాఘాతంతో వివాహిత మృతి ● మామిడి తోట యజమాని నిర్లక్ష్యంతోనే ప్రమాదమని ఆందోళన ● కేసు నమోదు చేసిన పోలీసులు



మృతి చెందిన ఆసీఫా





మృతి చెందిన శునకం, వానరం - రాతికూసానికి అమర్చిన స్టార్టర్

వి.కోట, జూలై 15: వి.కోట మండలం యాలకల్లు పంచాయతీ కపట్లబండ గ్రామంలో మామిడి తోట కంచెకు కరెంటు సరఫరా అయింది. తద్వారా విద్యుదాఘాతానికి గురై అహమద్‌జాన్ భార్య ఆసీఫా (32) మృతి చెందారు. కంచె ముందు ఇంట్లో నివాసం ఉంటున్న ఆసీఫా.. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో స్నానాల గదికి వెళ్లే క్రమంలో కంచెకు తగిలారు. అక్కడికక్కడే కుప్పకూలారు. విద్యుత్తు షాక్ అయి ఉంటుందని కుటుంబీకులు అనుమానించారు. వెంటనే రెస్కో వారికి సమాచారమిచ్చి సరఫరా నిలిపివేయాలని కోరారు. అప్పటికే మామిడి తోటకు ఇరు వైపులా రెండు చోట్ల కంచెకు తగిలి రెండు శునకాలు, మరో చోట ఓ వానరం మృతి చెందాయి. తోటలోని బోరు మోటారుకు చెందిన స్టార్టర్‌ను కంచెకు ఉన్న రాతి స్తంభానికి అమర్చారు. మిగిలిన వైరును మరో రాతి కూసానికి చుట్టారు. అందులోని వైరు ముళ్లకు తగిలి ఓ చోట కట్‌అయింది. అక్కడ్నుంచే తోటలోని కంచెకు విద్యుత్ సరఫరా అయి ఉంటుందని భావిస్తున్నారు. సమాచారం అందుకున్న రెస్కో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సరఫరా ఆపారు. ప్రమాదానికి గల కారణాలపై పరిశీలించారు. మామిడి తోట యజమానే కంచెకు విద్యుత్ సరఫరా ఇచ్చి మహిళ మృతికి కారకుడయ్యాడని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సీఐ లింగప్ప, ఎస్ఐ బాబు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. దీంతో కాసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. ఎట్టకేలకు బాధ్యులను శిక్షించి.. న్యాయం చేస్తామని పోలీసులు, స్థానిక నేతలు, గ్రామ పెద్దలు నచ్చజెప్పడంతో వారు వెనక్కితగ్గారు. మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు. ఈ ఘటన ప్రమాదవశాత్తూ జరిగిందా..? లేక కావాలనే విద్యుత్ సరఫరా ఇచ్చారా..? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పదెకరాల భూమి ఆక్రమించారు

కలెక్టర్‌కు గంటావారిపల్లె వాసుల ఫిర్యాదు



అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు, జూలై 15: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. బాధితులనుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ వినతులు స్వీకరించారు. పరిష్కారమయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖకు 94, పోలీసు శాఖ, జిల్లా పౌరసరఫరాలు, విద్యుత్, సర్వే అండ్ ల్యాండ్స్, జిల్లా రిజిస్ట్రార్, డీఎంఅండ్‌హెచ్‌వో, ఎస్ఎస్ఏ శాఖలకు ఒక్కోటి చొప్పున అర్జీలు వచ్చాయి.

● వెదురుకుప్పం మండలం జక్కిదొన పంచాయతీ గంటావారిపల్లెలో ఎంపీపీ(వైసీపీ) బంధువులు పదవిని అడ్డం పెట్టుకుని పది ఎకరాల భూమిని ఆక్రమించారని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 794-1 నుంచి 794-8 వరకూ ఉన్న 10.86 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని తెలిపారు. ఇందులో అక్రమంగా ఏర్పాటుచేసిన పరిశ్రమకు అనుమతులకోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసంచేశారని,విచారణ జరిపి నిజాలను నిగ్గుతేల్చాలని కోరారు.

● వెదురుకుప్పం మండలం జక్కిదొన పంచాయతీ గంటావారిపల్లెలో కాలిబాటను భూస్వాములు ఆక్రమించారని అదే గ్రామానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. తమ అనుభవంలో ఉన్న భూముల పక్కన బండిదారి ఉందని, దీనికి ప్రభుత్వ రికార్డులు కూడా ఉన్నాయని తెలిపారు. దారి ఆక్రమణపై మండలాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

పోలీసు శాఖకు 37 ఫిర్యాదులు

పాత డీపీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 37 వినతులు వచ్చినట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. ఇందులో భూ తగాదాలు 16, డబ్బు తగాదాలు 9, ఆస్తి తగాదాలు 5, వేధింపులు 4, కుటుంబ తగాదాల కింద 3 ఉన్నాయని వెల్లడించారు. ఏఎస్పీ అరీఫుల్లా, దిశా డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేద్దాం : కలెక్టర్



సమావేశంలో ఎస్పీతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేద్దామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన జిల్లా రోడ్డుభద్రతా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 379 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 170 మంది మృత్యువాత పడ్డారన్నారు. జాతీయ రహదారిలోనే ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాల ప్రాంతాలను 26 డెత్ స్పాట్ జోన్లుగా గుర్తించామని చెప్పారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై జాతీయ రహదారుల అధికారులు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎన్‌హెచ్ వెంట ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు రక్తాన్ని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. దీంతో పాటు ఆ కేంద్రాల్లో రాత్రివేళల్లో అత్యవసర చికిత్సల నిమిత్తం డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో ప్రభావతిని ఆదేశించారు. ఏరియా ఆస్పత్రుల్లో, చిత్తూరులోని జిల్లా ఆస్పత్రిలో ఇందుకోసం అవసరమైన పడకలు, అందుబాటులో మందులు ఉంచాలని ప్రభుత్వాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌ను సూచించారు. ప్రమాదాల్లో మృతిచెందిన వారికి సంబంధించిన ధ్రువపత్రాలు, క్లెయిమ్‌ల పరిష్కారంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు సత్వరం స్పందించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతతో రహదారి భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్పీ మణికంఠ సూచించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు గారాబంగా పెంచడంతో పాటు వారు అడిగిన వెంటనే వాహనాలను కొనిస్తున్నారన్నారు. పిల్లలు అతివేగంగా వీటిని నడపడం వల్ల ప్రమాదాలకు గురై.. ఒక్కోసారి మృత్యువాత పడుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీ (అడ్మిన్) అరీఫుల్లా, డీటీసీ నిరంజన్ రెడ్డి, ఎన్‌హెచ్ పీడీ కార్తిక్ రెడ్డి, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్&బీ ఎస్ఈ ఉమా మహేశ్వర్ రెడ్డి, డీపీవో లక్ష్మి, ఆర్టీసీ ఆర్ఎం జితేంద్రనాథ్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కృతజ్ఞతా యాత్ర



తిరుమల, ఆంధ్రజ్యోతి : రాజధాని అమరావతిని నిలబెట్టే నాయకుడిని రాష్ట్ర ప్రజలు ఎన్నుకున్నారని అమరావతి రైతులు సంతోషం వ్యక్తం చేశారు.అమరావతికి చెందిన పలువురు రైతులు 'కృతజ్ఞత పాదయాత్ర' పేరుతో తిరుమలకు చేరుకుని సోమవారం సాయంత్రం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ సుధాకర్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ.. రాజధానిని కాపాడుకుందాం-రాష్ట్రాన్ని పరిరక్షించుకుందామనే లక్ష్యంతో 1,631 రోజుల పాటు ఉద్యమం చేశామన్నారు. అయితే గత పాలకులు తమపై దౌర్జన్యాలు చేశారన్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం టూ దేవస్థానం పేరుతో చేసిన పాదయాత్రను కూడా వైసీపీ నాయకులు అడుగడుగునా అడ్డుకున్నారని వాపోయారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రజల సహకారంతో రాజధానికి, రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేశామన్నారు.అమరావతిని రక్షించడంతో పాటు రాష్ట్ర ప్రజలను కష్టాల నుంచి బయటకు తీసుకురావాలని స్వామిని గతంలో కోరుకున్నామన్నారు. శ్రీవారి, ప్రజల ఆశీస్సులతో రావణకాష్టంగా ఉన్న రాష్ట్రం ఎన్నికల తరువాత రామరాజ్యంగా మారిందన్నారు. ఈ క్రమంలో కృతజ్ఞత పాదయాత్ర పేరుతో 21 రోజుల పాదయాత్ర చేసి స్వామిని దర్శించుకున్నామన్నారు. పాలకులకు పూర్తి శక్తిసామర్థ్యాలు ఇచ్చి, అమరావతితో పాటు ఏపీని అభివృద్ధి చేసేలా ఆశీర్వదించామని కోరుకున్నామన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా!

పుంగనూరు, జూలై 15: పుంగనూరు పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. యువత, విద్యార్థులను మత్తుకు బానిసలను చేసి డెర్ డెలివరీ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నా గతంలో పోలీసు అధికారులు పట్టించుకోలేదు. దీంతో విచ్చలవిడిగా గంజాయి దొరికేది. కొంతమంది గతంలో వైసీపీ అనుచరులుగా ఉండటంతో పోలీసులు తెలిసినా పట్టించుకోకుండా ఉండిపోయారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడం.. హోంశాఖ మంత్రి అనిత గంజాయి అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీంతో ఎస్పీ మణికంఠ, పలమనేరు డీఎస్పీ విష్ణురఘువీర్ ఆదేశాలతో పోలీసులు గంజాయిపై ప్రత్యేక దృష్టిపెట్టి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. త్వరలోనే నిందితులను అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిసింది.

ముడిసరుకుల నాణ్యత పరిశోధనకు తిరుమలలో ప్రత్యేక లేబొరేటరీ

తిరుమల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భక్తులకు టీటీడీ అందిస్తున్న అన్నప్రసాదాల ముడి సరుకులు మరింత నాణ్యతతో కొనుగోలు చేసేందుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా) వారి సహకారం తీసుకోవాలని టీటీడీ ఈవో శ్యామలరావు అధికారులను ఆదేశించారు. అలాగే వారి సహకారంతో తిరుమలలో అత్యాధునిక పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఆయన ఎఫ్ఎస్ఎస్ఏఐ, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ.. ఆహార పదార్థాల్లో వినియోగించే ముడి సరుకులను టెండర్ల ద్వారా టీటీడీ కొనుగోలు చేస్తోందన్నారు. వీటి నాణ్యతను పెంచేందుకు అత్యాధునికమైన పరిశోధన కేంద్రాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సహకారంతో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు అందిస్తున్న జల ప్రసాదం నాణ్యత, వంటశాలలను ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ముడిసరుకుల కొనుగోలుకు సంబంధించి ఎస్‌ఓపీని తయారు చేయాలని జేఈవోను కోరారు. అన్నప్రసాద భవనంలో పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమలలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని జేఈవోను ఆదేశించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో కమలవర్ధన్‌రావు ఆదేశాల మేరకు ఫుడ్ సేఫ్టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాల నాణ్యత పెంచడానికి అవసరమైన సూచనలను ఈవోకు వివరించారు. జేఈవో గౌతమి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అండ్ ఫాస్ట్ ట్రాక్ నోడల్ అధికారి రవీంద్రారెడ్డి, ఎఫ్ఎస్ఎస్ఏఐ డిప్యూటీ డైరెక్టర్ బాలు నాయక్, టీటీడీ సీఈవో నాగేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీటీడీ సర్వర్లు డౌన్

చంద్రగిరి, జూలై 15: చంద్రగిరి సమీపంలోని శ్రీవారిమెట్టు నడకమార్గంలో సర్వర్లు మొరాయించడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.కాలినడక భక్తుల సౌకర్యార్థం శ్రీవారిమెట్టు ప్రారంభంలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు దివ్య దర్శన టోకెన్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. వర్షం నేపథ్యంలో సోమవారం సర్వర్లు నిలిచిపోవడంతో టోకెన్ల జారీలో అంతరాయం ఏర్పడింది. దీంతో భక్తులు క్యూలైన్లలో తడుస్తూనే బారులు తీరాల్సి వచ్చింది. 10 గంటల తరువాత సర్వర్లు పనిచేయడంతో భక్తులకు టైం స్లాట్ టోకన్లు జారీ చేశారు.



ఇర్లపల్లె సమీపంలో ఏనుగుల మకాం

సోమల, జూలై 15: సోమల మండలం పేటూరు పంచాయతీ ఇర్లపల్లె సమీపంలో ఆదివారం రాత్రి ఏనుగులు సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఏనుగుల సంచారం గుర్తించిన గ్రామస్తులు ఇళ్లకు తాళాలు వేసుకుని నిద్ర లేని రాత్రులు గడిపినట్లు చెప్పారు. కనికల చెరువు వద్ద మకాం వేసిన ఏనుగు మంద నుంచి పంటలను కాపాడు కోవడానికి నానా పాట్లు పడుతున్నామని వాపోయారు. ఈక్రమంలోనే పేటూరుకు చెందిన చిట్టి వరి నార్లును ఏనుగులు తొక్కి వేసినట్లు బాధితుడు విచారం వ్యక్తం చేశాడు. అటవీ అధికారులు ఏనుగుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి



మృతిచెందిన చైతన్య

సోమల, జూలై 15: కందూరు-నిమ్మనపల్లె మార్గం పగడాల వారిపల్లె మలుపు వద్ద సోమవారం ఉదయం గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొని బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయతీ కత్తిరివారిపల్లెకు చెందిన నారాయణ కుమారుడు చైతన్య బీటెక్ పూర్తిచేశాడు. జాతర కోసం సదుం మండలంలోని పచ్చార్ల గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనంలో స్వగ్రామమైన కత్తిరివారి పల్లెకు బయలుదేరాడు. పగడాలవారిపల్లె మలుపు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. చైతన్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ మార్గంలో వెళుతున్న ప్రయాణికులు గుర్తించి సోమల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కేజీబీవీలకు ఎన్‌సీసీ యూనిట్లు..!

చిత్తూరు (సెంట్రల్), జూలై 15: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో కొత్తగా ఎన్‌సీసీ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి లభించింది. ఈ మేరకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు జారీ చేసిన ఉత్తర్వులు జిల్లాకు అందాయి. కేంద్ర రక్షణ శాఖ ఎన్‌సీసీ యూనిట్ల విస్తరణలో భాగంగా కొత్తగా మూడు లక్షల కేడెట్లకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది. ఇందు కోసం నూతనంగా జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, కేజీబీవీలలో ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటుకు అవకాశం కల్పించింది. కేంద్ర పాఠశాల విద్యావిభాగం నుంచి రాష్ట్ర పాఠశాల విద్యలోని సమగ్రశిక్ష ప్రాజెక్టుకు సమాచారం ఇచ్చింది. కేజీబీవీల్లో ఎన్‌సీసీని ప్రోత్సహించాలనేది దీని ఉద్దేశ్యం. జిల్లాలో ఎనిమిది కేజీబీవీలు ఉండగా, డీఈవోలు, ఎస్ఎస్ ఏపీసీలు చొరవ తీసుకుని సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో పనిచేస్తున్న జీసీడీవో, ప్రిన్సిపాల్‌లు అందుబాటులోని ఎన్‌సీసీ బెటాలియన్ అధికారులను సంప్రదించి ఎన్‌సీసీ యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

గ్రామీణులకు అందుబాటులో డీసీసీబీ సేవలు

కుప్పం, జూలై 15: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలు గ్రామీణ ప్రజలకు, చిన్నసన్నకారు రైతులకు అందుబాటులో ఉంటాయని బ్యాంకు కుప్పం శాఖ మేనేజరు నవీన్ కుమార్ అన్నారు. బ్యాంకు అందిస్తున్న సేవలపై జిల్లా నుంచి వచ్చిన ఒక ప్రత్యేక బృందం సోమవారం కుప్పంలో కళాజాతా నిర్వహించింది. బంగారు రుణాలు, వ్యవసాయ రుణాలపైన తక్కువ వడ్డీ, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం, సురక్ష బీమా యోజన పథకం, అటల్ పెన్షన్ యోజన పథకం, డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైమ్ మోసాల గురించి ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ వారు ఈ కళాజాతాతోపాటు మేజిక్ షో కూడా నిర్వహించారు. డీసీసీబీ కుప్పం బ్రాంచి మేనేజరు నవీన్‌కుమార్‌తోపాటు ప్రధాన కార్యాలయంనుంచి వచ్చిన అధికారులు గిరివాణి, హజీత్, అక్రమ్ బాషా, అసిస్టెంట్ జనరల్ మేనేజరు సోమశేఖర్‌రెడ్డి, సిబ్బంది, ఖాతాదారులు, ప్రజలు, కళాతా బృందం సభ్యులు మెజీషియన్ విజయ్, డప్పు చిరంజీవి, వెంకటేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పలమనేరులో వాహనాల వేలం

పలమనేరు, జూలై15 : పలమనేరు ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు వేలం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు సమక్షంలో వేలం పాటలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే ఈ వేలం పాటల్లో పాల్గొనదలచిన వారు నిర్ణీత డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు తప్పనిసరిగా ఆధార్ తీసుకురావాలని కోరారు.

మురుగునీటి గుంట తొలగించాలి



పలమనేరు, జూలై15: పలమనేరు మున్సిపాలిటీ గడ్డూరు కాలనీలో జనావాసాల మధ్య ఉన్న మురుగునీటి గుంటను తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ మురుగునీటి గుంటలో దోమలు వృద్ధి జ్వరాలు ప్రబలు తున్నాయని వాపో తున్నారు. ఇప్పటికే కాలనీలో పలువురు జ్వరాల బారినపడ్డారని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కొళాయి అక్రమ కనెక్షన్లపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

పలమనేరు, జూలై15 : పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు ఇందిరమ్మ కాలనీలో అక్రమ కొళాయిలు, అక్రమ నిర్మాణాలపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. అక్కడి మహిళా వార్డు కౌన్సిలర్, ఆమెభర్త కాలనీలో పలు అక్రమకొళాయిలు, అక్రమ నిర్మాణాలకు కారణమని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కిరణ్‌కుమార్, బీఆర్సీకుమార్, టీడీపీ నాయకులు ఖాజాపీర్, నాగరాజు, చాంద్‌బాషా, మదన్‌మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పాపనూరులో వేణుగోపాలుడి ఊరేగింపు



గుడుపల్లె, జూన్ 15: పాపనూరులో కొలువైన వేణుగోపాలుడిని వేడుకగా ఊరేగించారు. వేణుగోపాల స్వామి ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం వేణుగోపాలుడి ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ ఊరేగించారు. మహిళలు స్వామివారికి కర్పూర హారతులు పట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు ఈ ఉత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సొంత ఖర్చులతో రోడ్డుకు మరమ్మతులు



శాంతిపురం, జులై 15 : ఎంకేపురం - గుండిశెట్టిపల్లె గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డును ఎంకేపురం గ్రామానికి చెందిన టీడీపీ నేతలు బయ్యారెడ్డి, ప్రకాష్‌ల ఆధ్వర్యంలో పంచాయతీ నాయకులు బాగుచేశారు. సొంత ఖర్చులతో రోడ్డుకు మట్టితోలి మరమ్మతులు చేశారు. గత టీడీపీ ప్రభుత్వం గుండిశెట్టిపల్లె - ఎంకేపురం గ్రామానికి వెళ్లే రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ రోడ్డు విషయం పట్టించుకోలేదు. ఫలితంగా ఆ నిధులు వెనిక్కి వెళ్లాయి. దీంతో రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. గుంతలపడ్డ రోడ్డులోనే జనం అవస్థలు పడుతూ వచ్చారు. మూడు రోజులుగా వర్షాలు పడుతుండడంతో రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో టీడీపీ నేతలు రోడ్డుకు మట్టితోలి మరమ్మతులు చేపట్టారు.

కలెక్టర్‌ను కలిసిన బోయకొండ ఈవో

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15: బోయకొండ గంగమ్మ ఆలయ ఈవో ఏకాంబరం సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ రెడ్డిలను కలిసి స్వామివారి ప్రసాదాలు అందించారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, జూలై15: పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ విభాగంలో ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు మాస్టర్ డిగ్రీ లేదా ఎంసీఏ లేదా ఎంటెక్‌లో 55శాతం మార్కులు సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. నీట్ సెలెక్ట్, పీహెచ్‌డీ, అధ్యాపక అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



కుప్పం రూరల్, జూలై 15: కుప్పం మండలం అడవిబూదుగూరులో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును కుప్పం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం ప్రారంభించారు. ఈ బస్సు అడవిబూదుగూరు గ్రామం నుంచి యానాదిపురం మీదుగా శివానందపురం దాకా నడుస్తుంది. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కారు - ద్విచక్రవాహనం ఢీ ముగ్గురికి తీవ్ర గాయాలు

శాంతిపురం, జులై 15 : కుప్పం - కేజీఎఫ్ అంతరాష్ట్ర రహదారిలోని గెసికపల్లె క్రాస్ వద్ద సోమవారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. రాళ్లబూదుగూరు పోలీసుల కథనం మేరకు.. గుడుపల్లె మండలం యామనూరు గ్రామానికి చెందిన విజయ్(29), శ్రీనివాసులు(34), తోడెళ్ల గేటు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం కలిసి సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో కర్ణాటక రాష్ట్రం కెంపాపురానికి బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్ నుంచి కుప్పం వెళుతున్న కారు గెసికపల్లె క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంలో ప్రయాణి స్తున్న విజయ్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం గాయపడ్డారు. క్షతగాత్రలను స్థానికులు 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంట గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలి

గుడుపల్లె, జూన్ 15: వంట గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి గుడుపల్లె హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ అధినేత పళణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్యాస్ వినియోగదారులు గ్రామాల్లో ఉన్న సేవా కేంద్రం లేదా గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో చేయించు కోవాలి కోరారు. వినియోగదారులు గ్యాస్ బుక్, ఆధార్ కార్డుతో రావాలని తెలిపారు.

చతుర్మాస మహాయాగంలో ఎమ్మెల్యే అమర్ దంపతులు



పలమనేరు, జూలై15 : బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామ సమీపంలోని దేవరకొండ వద్ద శివపార్వతుల గోశాలలో జరిగిన చతుర్మాస మహాహోమ యజ్ఞం లో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, రేణుకారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులతో ఈనెల 11నుంచి 15 వరకు ఐదు రోజులపాటు లోక కళ్యాణార్థం జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించి మహాయజ్ఞం నిర్వ హించారు. గోపూజతో పాటు దేవరకొండలో వెలసిన జలకంఠేశ్వరస్వామిని దర్శిం చుకు న్నారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ నాయకులు యువరాజులు నాయుడు, జయప్రకాష్‌నాయుడు, టీడీపీ రాయలసీమ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ

చిత్తూరు కల్చరల్, జూలై 15: గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి విజయకుమార్ రచించిన కవితాలహరి పుస్తకాన్ని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. రచయిత విజయ్‌కుమార్‌ను అభినందిస్తూ, మరిన్ని రచనలు సాగించాలని కోరారు.

మామిడి కాయల లారీ బోల్తా



శాంతిపురం, జులై 15 : కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలోని కనమలదొడ్డి వద్ద సోమవారం మామిడి కాయలతో వెళుతున్న లారీ బోల్తాపడింది. లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరక్క పోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. కనమలదొడ్డి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజపేట రోడ్డులో మామిడి కాయలు లోడు వేసుకొని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి బయలుదేరాడు. కనమలదొడ్డి సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. లారీ డ్రైవర్ సుబ్రమణ్యం, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీలో ఉన్న మామిడి కాయలు రోడ్డు పాలయ్యాయి. సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుకు లారీ అడ్డంగా పడడంతో గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడింది. రాళ్లబూదుగూరు పోలీసులు లారీని పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుల అహంకారిని అరెస్టు చేయాలి: బీజేపీ



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 15: కుల అహంకారంతో దళితుడిపై దాడిచేసిన వెంకటసుబ్బారెడ్డిని అరెస్టు చేయాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కడప జిల్లా ఒంటిమిట్ట మండలం పెన్నపేరం గ్రామానికి చెందిన దళితుడైన ప్రభాకర్ అరుగుపై పడుకున్నాడని అదే గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి దాడిచేయడం గర్హనీయమన్నారు. అంతేగాక ఒంటిపై వేడి నూనె పోయడం దారుణమన్నారు. ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలని తహసీల్దార్ శివయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరసింహులు, అయూబ్‌ఖాన్, రాజారెడ్డి, శ్రీనివాసులు, మఠం బాబు, రాజాశెట్టి పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలి



నిరసన చేస్తున్న వాల్మీకి సంఘనాయకులు

పుంగనూరు రూరల్, జూలై15: నంద్యాల జిల్లా పగిడ్యాల మచ్చుమర్రి గ్రామంలో ఎనిమిదేళ్ల చిన్నారి వాసంతిపై గ్యాంగ్ రేప్ చేసి హత్య చేసిన వారిని ఎన్‌కౌంటర్ చేయాలని వాల్మీకి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కె.సుకుమార్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఇందిరాసర్కిల్లో వాల్మీకి సంఘనాయకులు చిన్నారి వాసంతి హత్యపై నిరసన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారి మృతదేహాన్ని తల్లిదండ్రులను అప్పగించాలని కోరారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సంఘనాయకులు అద్దాల నాగరాజ, జయసింహ, మంజునాథ్, బాబురావు, వెంకటాద్రి, విశ్వనాథ్, రెడ్డెప్ప, మనోహర్, నరసింహులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో నిధుల గోల్‌మాల్ : టీడీపీ



ఎంపీడీవో శివప్రసాద్‌తో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూలై15: స్థానిక జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుండానే నిర్మించినట్లు చూపి నిధులు కాజేశారని టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టీడీపీ నాయకులతో కలసి ఎంపీడీవో శివప్రసాద్, హౌసింగ్ ఏఈ మణిలతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం కాకుండానే బిల్లులు స్వాహా చేశారన్నారు. డ్రా చేసిన బిల్లులు చౌడేపల్లె సర్పంచ్ వరుణ్‌భరత్, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, మాజీ జడ్పీటీసీ రుక్మిణమ్మ దోచుకున్నారని ఆరోపించారు. అనర్హులకు ఇళ్లు మంజూరుచేసి వారి నుంచి భారీగా నగదు వసూళ్లు చేశారని పేర్కొన్నారు. మండలంలో సుమారు 3000 ఇళ్లు మంజూరైతే 700 ఇళ్లు మొదలు పెట్టకుండానే వైసీపీ నాయకులు బిల్లులు స్వాహా చేశారని వివరించారు. విచారణ జరిపి దోచుకున్న సొమ్మును రికవరీ చేయాలని కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

గుడుపల్లె, జూన్ 15: మండల పరిధిలోని వేపమాను కొండ గుడివంకపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకాలు, పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

24 నుంచి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

గుడివంక కొండపై వెలసిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఏడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24న ధ్వజారోహణం, 25న రుద్రాభిషేకం, 26న కల్యాణోత్సవం, 27న రథోత్సవం, 28న ఉంజల్ సేవ, 29న ఆడికృత్తిక, 30వన మహా మంగళహారతి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని వివరించారు. ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. అలాగే దాతల సహకారంలో అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

మొక్కలు జీవజాల శ్వాసకోశాలు



పాఠశాలలో మొక్కలు నాటుతున్న కేఈసీ వైస్ ప్రిన్సిపాల్ తదితరులు

కుప్పం, జూలై 15: మొక్కలు ఈ లోకంలోని జీవజాలానికి శ్వాసకోశాలవంటివని కుప్పం ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్ అన్నారు. కుప్పంలోని కొత్తపేట షికారీ కాలనీ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొక్కలు నాటి నీళ్లు పోసి, సంరక్షణ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి పారిశ్రామిక, సాంకేతిక యుగంలో అడవులు నరికి, కొండలు కూల్చి పర్యావరణాన్ని మానవాళి విధ్వంసం చేస్తోందన్నారు. అయితే ఆకుపచ్చదనం లేకపోతే మనకు బతుకు లేదని మనిషి తెలుసుకోవాలన్నారు. పచ్చదనం లేకుంటే కాలుష్యం తీవ్రమైన సమాజాన్ని అనారోగ్యం పట్టి పీడిస్తుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం కో ఆర్డినేటర్లు మాధవన్, గంగాధరన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురుప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పీఆర్వో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఇతర టీడీపీ నేతలు, ఉపాధ్యాయులు

శాంతిపురం, జులై 15 : ప్రతి విద్యార్థీ ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు కోరారు. సోమవారం శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ చైర్మన్ సరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, షూస్ పంపిణీ చేశారు. పాఠశాలలో టీచర్ల సమస్య పరిష్కరించాలని హెచ్‌ఎం నటరాజరెడ్డి ఎమ్మెల్సీని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ టీచర్ల నియామకం జరిగే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీనిచ్చారు. అనంతరం మఠం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు జయపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, ఏఎంసీ నాగరాజు, క్యాబేజీ మురళి, ఆర్ ఎస్ మణి, రమేష్, బాలు, సింగిరి శ్రీనివాసులు, జయపాల్ కుప్పం నియోజకవర్గ టీడీపీ మహిళ అధ్యక్షురాలు అనుసూయ, మండల మహిళ అధ్యక్షురాలు శ్యామల, సుగునమ్మ, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, రాళ్లబూదుగూరు ఎస్ నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల షెడ్లకు రాయితీ : టీడీపీ



మాట్లాడుతున్న ఉయ్యాల రమణ

రొంపిచెర్ల, జూలై15: పశువుల, మేకలు, గొర్రెలు, కోళ్ల షెడ్లను రాయితీపై నిర్మించుకోవడానికి ప్రభుత్వం చేయూతనిస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఉయ్యాల రమణ అన్నారు. సోమవారం ఆయన స్థానిక టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణానికి 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు నిర్మించుకుంటే 70 శాతం రాయితీ ఇస్తుందన్నారు. యూనిట్‌కు గరిష్టంగా రూ.60900 నుంచి 20700 వరకు పెంపకందారులకు లబ్ధిచేకూరుతుందని వివరించారు. గోకులాల పేరుతో వీటిని నిర్మించు కోవచ్చన్నారు. ఈ సమావేశంలో నాయకులు అమరనాథరెడ్డి, సిద్దయ్య, శివారెడ్డి, మదనమోహన్‌లు పాల్గొన్నారు.

పేదలకు అమ్మ కమిటీ అన్నదానం



పుంగనూరు, జూలై 15: పుంగనూరు ఇందిరా సర్కిల్‌లో 36 వారాలుగా ప్రతి సోమవారం పేదలకు పులినాడు అమ్మ అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేస్తున్నారు. ఈ సోమవారం సైతం అన్నదానం చేశారు. వారపు సంతకు, వివిధ పనులపై పుంగనూరుకు వచ్చే నిరుపేదలకు, నిరాశ్రయులకు, చిరువ్యాపారులకు, విద్యార్థులకు, ప్రజలకు మధ్యాహ్నం భోజనం, అరటిపండు ఉచితంగా అందజేసి ఎంతోమంది ఆకలి తీర్చారు.

రొంపిచెర్ల ఈవోఆర్డీగా నాగరాజ

రొంపిచెర్ల, జూలై15: రొంపిచెర్ల మండల ఈవోఆర్డీగా రొంపిచెర్ల పంచాయితీ ఈవో జి.నాగరాజ సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. ఇక్కడ ఈవోఆర్డీగా పనిచేస్తున్న రాజేంద్ర సెలవులో వెళ్లడంతో నాగరాజును నియమిస్తూ చిత్తూరు పంచాయతీ అధికారి లక్ష్మి ఉత్తర్వులు జారీచేశారని వివరించారు.

కొలుపు దేవర్లకు ఏర్పాట్లు

సోమల, జూలై 15: సోమల మండలం నడింపల్లెలో కొలువుదీరిన ఎల్లమ్మదేవత ఆలయంలో కొలుపు దేవర్లకు ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. ఈ నెల 17, 18 తేదీల్లో ఉత్సవాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆలయాన్ని సుందరంగా పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. నడింపల్లె నుంచి తిరుపతి ప్రధాన రోడ్డు వరకు విద్యుత్ దీపాలంకరణలు చేశారు.

పంపిణీ కాని ప్లాస్టిక్ చెత్తబుట్టలు



సదుం, జూలై 15: తడి, పొడి చెత్త సేకరణ కోసం వచ్చిన ప్లాస్టిక్ బుట్టల పంపిణీని అధికారులు పట్టించుకోవడం లేదు. నెల క్రితం మండలానికి చేరిన ప్లాస్టిక్ బుట్టలు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిరుపయోగంగా పడిఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి చెత్తబుట్టల్ని ఇంటింటికీ పంపిణీ చేస్తే ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

సోమల, జూలై 15: మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేశారు. అర్చకులు వేదమంత్రాల నడుమ ధ్వజారోహణం జరిపారు. వివిధ హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని ఉత్సవమూర్తులను పల్లకీలో సుందరంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూరహారతులు పట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

రొంపిచెర్ల,జూలై15: మండలంలోని పీలేరు-రొంపిచెర్ల రోడ్డు మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. పీలేరుకు టమోటా బాక్సులతో వస్తున్న బొలెరో వాహనాన్ని చెంచమరెడ్డిగారిపల్లెకు చెందిన కిరణ్ (22) తన గ్రామ సమీపంలో ఢీకొన్నాడు. కిరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్ఐ మధు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పుంగనూరులో మొహర్రం వేడుకలు



పుంగనూరు రూరల్, జూలై15: మొహర్రం పండుగను పుంగనూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక కుమ్మరవీధిలో పీర్లకు, హజరత్ సుభానీ దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సద్దాంహుసేన్, బాబాఫ కృద్దిన్, ఆంజాద్, జావీద్, రిజ్వాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టు కన్నుమూత



శ్రీనివాస మొదలియార్

పుంగనూరు, జూలై 15 : పుంగనూరుకు చెందిన సీనియర్ జర్నలిస్టు వి.శ్రీనివాస మొదలియార్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందా రు. పట్టణ సమీపంలోని చెంగాలాపురానికి చెందిన శ్రీనివాస మొదలియార్ పది రోజులుగా ఊపిరితిత్తులకు సంబంధించి మదనపల్లెలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చారు.సోమవారం తెల్లవారుజామున పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.పలు పత్రికల్లో పని చేసిన శ్రీనివాస మొదలియార్ చనిపోయారని తెలియడంతో పట్టణ ప్రముఖులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేగంగా వినతుల పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 15: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందే వినతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నిర్దీత గడువు లోపు పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో అధికారులతో కలిసి ఆమె బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, నివేదికను ఇవ్వాలన్నారు. గతవారం అందిన అర్జీలపై సమీక్షించారు. రెవెన్యూకు 2, మెప్మాకు 2, ఇంజనీరింగ్‌కు 2, పబ్లిక్ హెల్త్‌కు 2చొప్పున అర్జీలు వచ్చాయి. ఎంహెచ్‌లో అనిల్‌కుమార్ నాయక్, ఎంఈ గోమతి, మేనేజర్ గోపాలకృష్ణవర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న ఐవోసీఎల్ సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), జూలై 15: పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఐవోసీఎస్ సీనియర్ మేనేజర్ నారాయణ కోరారు. అటవీశాఖ సమన్వయంతో సోమవారం స్థానిక నీవానది సమీపంలోని నగరవనంలో ఐఓసీఎల్ ఆధ్వర్యంలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టారు. భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణాన్ని అందించాలంటే మొక్కలు నాటాలన్నారు. ఐవోసీఎల్ మేనేజర్ చైతన్య, అటవీ శాఖ అధికారులు, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

కామరాజ్ నాడార్ విగ్రహం ఏర్పాటు చేయాలి



కామరాజనాడార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చిత్తూరు, జూలై 15: చిత్తూరులో తమిళనాడు మాజీ సీఎం కామరాజ్ నాడార్ విగ్రహం ఏర్పాటు చేయాలని చిత్తూరు నగర నాడార్ సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ విగ్రహం వద్ద కామరాజ్ నాడార్ 122వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. సంఘ జనరల్ సెక్రటరీ మునీశ్వరన్ నాడార్ మాట్లాడుతూ సీఎంలకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి కామరాజ్ అన్నారు. తమిళనాడులో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. సంఘ కోశాధికారి సెల్వకుమార్, ఉపాధ్యక్షుడు పూమని నాడార్, గౌరవాధ్యక్షులు గోపాల్ నాడార్, కేఎం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కామరాజు నాడార్ సేవలు మరువలేనివి



కామరాజ్ నాడార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 15: తమిళనాడు విరుదనగర్‌లో కల్లుగీత కుటుంబంలో జన్మించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కామరాజ్ నాడార్ సేవలు మరువలేనివని జిల్లా ఈడిగ గౌడ్ మహాజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కొనియాడారు. నాడార్ 121 జయంతిని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంచి పెట్టారు. సంఘం నాయకులు దొరబాబు, ప్రసన్నకుమార్, శ్రీనివాసన్, తరుణ్, హెచ్ఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

కొండ మల్లీశ్వరస్వామికి పాలాభిషేకం



కొండమల్లీశ్వరస్వామి

వెదురుకుప్పం, జూలై 15: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలో గల అరుణగిరి క్షేత్రంలో జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదం చేశారు. ఆలయ ఆవరణలో అన్నమయ్య, శివనామ సంకీర్తనలను ఆలపించారు. ఎగువ కన్నికాపురం సమీపంలో ఉన్న సిద్దేశ్వర స్వామి ఆలయంలో పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. చవటగుంట ఆవుదేవర నందీశ్వరుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా ద్రౌపదీ కల్యాణం

పాలసముద్రం, జూలై 15: మండలంలోని బలిజకండ్రిగ ద్రౌపదీసమేత ధర్మరాజుల ఆలయ తిరునాళ్లలో భాగంగా సోమవారం ద్రౌపదీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవులు, ద్రౌపదీ విగ్రహాలను ఆలయ ఆవరణలో ఉంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణఘట్టాన్ని పూర్తిచేశారు. ఉభయదారులుగా రామానాయుడు, కేశవులు, హేమాద్రి, మార్కొండనాయుడు వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త మురళి మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోళ్లఫారాల దుర్గంధం భరించలేకున్నాం..

పాలసముద్రం, జూలై 15: మండలంలోని నరసింహాపురం పంచాయతీ టీవీఎన్ఆర్‌పురం గ్రామ సమీపంలో కోళ్లఫారాల దుర్గంధం భరించలేకపోతున్నామని స్థానికులు అంటున్నారు. చుట్టూ 10 ఫారాలు ఉన్నాయని, వాటిని సరిగా శుభ్రం చేయకపోవడంతో వర్షాలకు తడిసి విపరీతమైన వాసన వస్తోందని, ఈగలు దోమల మోతతో అల్లాడుతున్నామని వాపోతున్నారు. పరిసర ప్రాంతాల్లోని వంద కుటుంబాల వారు ముక్కుమూసుకుని బతకాల్సి వస్తోందన్నారు. చర్యలు చేపట్టాలని యాజమాన్యాలకు, పంచాయతీ అధికారులకు విన్నవించినా లాభం లేకపోతోందన్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

శ్రీరంగరాజపురం, జూలై 15: ఎస్ఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎ.కీర్తన ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్ఎం ఎన్.శ్రీనివాసులు తెలిపారు. తల్లిదండ్రులు రామ్మూర్తి, కోమల, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.



కీర్తన



చైతన్య

కార్వేటినగరం : స్థానిక ప్రభుత్వ హైస్కూల్ పదో తరగతి విద్యార్థి పి.చైతన్య ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకీ ఎంపికయ్యారు. టీచర్ల బృందం విద్యార్థిని అభినందించింది.

గతుకుల రహదారి



గుంతలమయంగా మంగళపల్లి రహదారి

బంగారుపాళ్యం, జూలై 15: మండలంలోని మంగళపల్లి రహదారి గుంతలమయంగా మారింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రహదారి దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రస్తుత వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో వాహనదారులు, పాద చారులు పడి గాయాలపాలవుతున్నారు. పలు గ్రామాలను కలిపే ఈ రహదారిని బాగు చేయాలని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా దృష్టి సారించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలి



ఎంఈవోకు వినతిపత్రమిస్తున్న పెరుమాళ్‌గుడి వాసులు

నగరి, జూలై 15: పాఠశాల విలీనాన్ని తక్షణం రద్దు చేయాలని పట్టణ పరిధిలోని పెరుమాళ్‌గుడి వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈవో శ్రీదేవికి వినతి పత్రం అందించారు. తమ ప్రాంతంలోని ఎంపీపీ బాలికల ప్రాథమిక పాఠశాల నుంచి 3, 4, 5 తరగతులను గత ప్రభుత్వం నగరి పీసీఎన్ ప్రభుత్వ పాఠశాలకు తరలించిందని తెలిపారు. చిన్న పిల్లలు మూడు జంక్షన్లు దాటుకుని వెళ్లాలంటే ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉందన్నారు. 1933 నుంచి ఉన్న పాఠశాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుణశేఖర్, జ్యోతినాయుడు, రాజశేఖర్, పాఠశాల కమిటీ ఛైర్మన్ మీరా పాల్గొన్నారు.


ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న యువకులు



నగరి జూలై15: ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మున్సిపాలిటీ పరిధిలోని ధెరణి వాసులు కోరారు. సోమవారం కుశస్థలీ నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను వారు అడ్డుకుని నగరి తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డికి సమాచారం అందించారు. స్పందించిన తహసీల్దార్ స్థానిక వీఆర్‌వోను పంపి రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు.

శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్ర భవనం

కూలేందుకు సిద్ధంగా ఉన్నవైనం



గంగాధరనెల్లూరు, జూలై 15: మండలంలోని కాళేపల్లె జడ్పీ హైస్కూల్ స్థలంలోని ఆరోగ్య ఉప కేంద్ర భవనం చెత్తాచెదారంతో డంపింగ్‌యార్డుగా మారిపోయింది. శిథిలావస్థకు చేరుకుని కూలేందుకు సిద్ధంగా ఉంది. వరత్తూరు పంచాయతీ కాళేపల్లె గ్రామంలో 40ఏళ్ల క్రితం ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని నిర్మించారు. గ్రామస్థులకు ఎన్నో సేవలు అందించిన ఈ కేంద్రం ఆలనాపాలన పట్టించుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులూడు తోంది. వర్షాకాలంలో నీరు లోనికి ప్రవేశిస్తున్నాయి. తలుపులు, కిటికీలు చోరీకి గురయ్యాయి. గ్రామస్థులు ఈ భవనం ఆవరణలోనే చెత్తాచెదారం పడేస్తున్నారు. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పందికొక్కులు, విషసర్పాలకు నిలయంగా మారింది. పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు దుర్వాసన భరించలేకపోతున్నారు. వ్యాధుల బారినపడుతున్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జీడీనెల్లూరులో కార్లవిడిభాగాల తయారీ పరిశ్రమ



ఎమ్మెల్యే థామస్‌ను కలిసిన ఫ్యాక్టరీ ప్రతినిధులు

గంగాధరనెల్లూరు, జూలై 15: జీడీనెల్లూరులో త్వరలో కార్ల విడి భాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ తెలిపారు. తద్వారా ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. కొరియా దేశానికి చెందిన కేపీవీ గ్లోబల్ వెంచర్ సంస్థ సీఈవో యంగ్ డే నౌన్ చెన్నై నగరంలో సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వపరంగా సహకరించాలని సీఈవో కోరారు. త్వరలోనే సీఎం చంద్రబాబును కలిసి ఫ్యాక్టరీ ఏర్పాటుపై చర్చిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. దేశ, విదేశ ఫ్యాక్టరీ ప్రతినిధులను సంప్రదించి మరికొన్ని ఫ్యాక్టరీలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

18 నుంచి కుష్ఠు నిర్మూలన కార్యక్రమం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15: జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ఈనెల 18వ తేదీ నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమం చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన పోస్టర్, బ్యానర్‌లను ఎస్పీ మణికంఠతో కలిసి ఆవిష్కరించారు. జిల్లాలోని 64 పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్‌సెంటర్ల పరిధిలో ఆగస్టు 2వ తేదీ వరకు 3,080 బృందాల ద్వారా సర్వే కొనసాగుతుందని చెప్పారు. డీఎంహెచ్‌వో ప్రభావతి మాట్లాడుతూ సర్వేలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

చాతుర్మాస మహాయాగం ముగింపు



యాగంలో ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్

బంగారుపాళ్యం, జూలై 15: మండలంలోని మొగిలిలో వెలసిన శివపార్వతుల గోశాల దేవరకొండలో ఐదు రోజులుగా జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చాతుర్మాస మహాయాగ మహోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం అష్టోత్తర మృతికాలింగ పూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, రుద్రహోమం, మహా పూర్ణాహుతి, కలశస్థాపన నిర్వహించారు. పలమనేరు, పూతల పట్టు ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, మాజీ ఎంపీపీ సుచిత్ర, ప్రవీణ్, గంగారపు గోపి పాల్గొన్నారు.

ఎంపీ దగ్గుమళ్లకు సన్మానం



చిత్తూరు సిటీ, జూలై 15: ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావును ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు సోమవారం హైదరాబాదులో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ఐఆర్ఎస్ అధికారిగా దగ్గుమళ్ల ఆ పదవికే వన్నె తెచ్చారని కొనియాడారు. ఎంపీ మాట్లాడుతూ ప్రజల ఆశయాలకను గుణంగా పనిచేస్తానన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బోయకొండ ఈవో



కలెక్టర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఈవో ఏకాంబరం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 15: బోయకొండ గంగమ్మ ఆలయ ఈవో ఏకాంబరం సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువ కప్పి, అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఆలయానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అనంతరం జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ రెడ్డిలను కలిసి స్వామివారి ప్రసాదాలు అందించారు.

సర్టిఫికెట్లను ఆలస్యం చేయకండి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీ కళ్యాణి

గుడిపాల, జూలై 15: ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్లను సకాలంలో అందించేవిధంగా చూడాలని తహసీల్దార్ విజయలక్ష్మి, డీటీ కళ్యాణి అన్నారు. సోమవారం వారు వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతూ డీలర్లు సకాలంలో డీడీలు చెల్లించేవిధంగా, గ్రామస్థాయిలో ఏవైనా భూసమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేవిధంగా చూడాలన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

సోమల, జూలై 15: మండలంలోని కమ్మపల్లెలో కొలువుదీరిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు విశేష పుష్పాలంకరణ చేశారు. అర్చకులు వేదమంత్రాల నడుమ ధ్వజారోహణం జరిపారు. వివిధ హోమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని ఉత్సవమూర్తులను పల్లకీలో సుందరంగా అలంకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూరహారతులు పట్టారు.

మామిడి కాయల లారీ బోల్తా



శాంతిపురం, జులై 15 : కుప్పం -- పలమనేరు జాతీయ రహదారిలోని కనమలదొడ్డి వద్ద సోమవారం మామిడి కాయ లతో వెళ తున్న లారీ బోల్తాపడింది. లారీలో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం జరక్క పోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. కనమలదొడ్డి గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రాజపేట రోడ్డులో మామిడి కాయలు లోడు వేసుకొని తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరికి బయలుదేరాడు. కనమల దొడ్డి సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించ బోయి లారీ అదుపుతప్పి బోల్తాపడింది. లారీ డ్రైవర్ సుబ్రమణ్యం, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. లారీలో ఉన్న మామిడి కాయులు రోడ్డు పాలయ్యాయి. సుమారు లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డుకు లారీ అడ్డంగా పడడంతో గంట పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడింది. రాళ్లబూదుగూరు పోలీసులు లారీని పక్కకు తరలించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విద్యే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే మురళి, మోహన్‌నాయుడు

యాదమరి/బంగారుపాళ్యం/ఐరాల, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల్లో చదువు కుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ అన్నారు. మండలంలోని కాశిరాళ గొల్లపల్లె హైస్కూల్‌లో సోమవారం ఆయన పుస్తకాలు, ప్రయోగశాలకు అవసరమయ్యే పరికరాలను అందించారు. బంగారుపాళ్యం మండలంలోని మంగళపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళ విద్యావాణి 27వ సంచికను ఆవిష్కరించారు. ఐరాల ప్రాథమిక పాఠశాలలో మేదరమిట్ట శంకర్‌నాయుడు, పార్వతమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో దాత మేదర మిట్ట మోహన్‌నాయుడు ఎమ్మెల్యే చేతుల మీదుగా రెండు లక్షల రూపాయల విలువైన 5,500 నోటు పుస్తకాలను అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నామని తెలిపారు. చదువు వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగపడే సాధనమని, నిర్లక్ష్యం చేయవద్దని అన్నారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మురార్జీ, ప్రధాన కార్యదర్శి రవి, నాయకులు వల్లేరు అమరనాథనాయుడు, చిట్టిబాబు, రవి మొదలియార్, ధరణికుమార్, ఎంఈవో రుక్మిణి పాల్గొన్నారు.

నెల రోజుల్లోనే హామీల అమలు

గంగాధరనెల్లూరు, జూలై 15: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజులకే ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో కొన్నింటిని సీఎం చంద్రబాబు నెరవేర్చారని టీడీపీ క్రిస్టియన్ సెల్ చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జాన్, టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బుజ్జిబాబు అన్నారు. వేల్కూరు సచివాలయానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫొటోలను సోమవారం అందజేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లోకనాథం, నేతలు మునస్వామి, వడివేలు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.


30ఏళ్ల తర్వాత రామ్‌విలాస్ సభ ప్రారంభం



వివరాలు వెల్లడిస్తున్న రమణ

చిత్తూరు కల్చరల్, జూలై 15: నగరంలో 30 ఏళ్లుగా మూతపడిన చిత్తూరు రామ్‌విలాస్ సభ సోమవారం నూతన కమిటీ ఆధ్వర్యంలో పునఃప్రారంభమైంది. కమిటీ సభ్యుడు రమణ మాట్లాడుతూ 1901లో బ్రిటీష్ పాలకుల పాలనలో ప్రారంభమైన రామ్‌విలాస్ సభ సాంస్కృతిక కార్యక్రమాలతో పేరుప్రఖ్యాతులు పొందిందన్నారు. ఆలనా పాలనా లేకుండా 1994 నుంచి మూతపడిందని, తిరిగి ప్రారంభం కావడం శుభపరిణామమని అన్నారు. సభ నూతన అధ్యక్షుడు రంగనాథం మాట్లాడుతూ ఇకపై క్రమం తప్పకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పుస్తకావిష్కరణ



చిత్తూరు కల్చరల్, జూలై 15: గ్రంథాలయ విశ్రాంత ఉద్యోగి విజయకుమార్ రచించిన కవితాల హరి పుస్తకాన్ని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో సోమవారం ఆవిష్కరించారు. రచయిత విజయ్‌కుమార్‌ను అభినందిస్తూ, మరిన్ని రచనలు సాగించాలని కోరారు. పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

విజయపురంలో పరిశ్రమలు ఏర్పాటు చేయండి



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం/నగరి, జూలై 15: నగరి నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి యువరాజ్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరారు. ఈ మేరకు సోమవారం అమరావతిలో ఆయన్ను కలిసి విన్నవించారు. అనంతరం ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కలిసి నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువులు, సప్లై చానెల్స్ మరమ్మతులపై చర్చించారు. నియోకవర్గంలో రోడ్ల దుస్థితిపై పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్‌ను కలిసి చర్చించారు.

ఉనికి కోసమే ప్రభుత్వంపై విమర్శలు



మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, జూలై 15: ఉనికి కోసమే వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ అన్నారు. సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ప్రజల నుంచి వస్తున్న మంచి స్పందన చూసి అక్కసుతో వైసీపీ నేతలు, నీలి మీడియా విషప్రచారం చేస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన నెల రోజుల్లోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును స్వయంగా సీఎం చంద్రబాబు పరిశీలించి, పనుల పునః ప్రారంభానికి చర్యలు చేపట్టారని చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీ నేతలకు లేదని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు.







గుంతలమయంగా ఉన్న సీకేపల్లి, పానాటూరు, ఎంసీఆర్ క్రాస్ రోడ్లు

గతుకుల రోడ్లతో ప్రాణాలు హరీ..!

గుడిపాల, జూలై 15: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారి ఎంసీఆర్ క్రాస్, పానాటూరు వద్ద రోడ్డు గుంతలమయంగా మారి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలల క్రితం పానాటూరు వద్ద మోటారు బైకులో పడి ఇద్దరు మృతిచెందారు. మరికొంత మంది గాయాలపాలయ్యారు. వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తపల్లి క్రాస్ నుంచి కట్టకిందపల్లి రహదారికి వెళ్లే తారురోడ్డు కంకరతేలి ఎక్కడ పల్లం, ఎక్కడ మిట్ట తెలియక రాత్రివేళల్లో ప్రయాణికులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి, రోడ్లను బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.